క్లుప్తంగా

బాధిత కుటుంబానికి నగదు అందజేత



నగదు అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు, కార్మికులు

మందమర్రిరూరల్/కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట–2 గనిలో సీనియర్ మైనింగ్ సర్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ మచ్చ రమేష్ ఇటీవల మృతి చెందాడు. తోటి కార్మికులు శుక్రవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి సేకరించిన రూ.లక్ష పది వేలు మృతుడి భార్యకు అందజేశారు. యూనియన్ ప్రతినిధులు, కార్మికులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఎంపీవో

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు నీల్వాయి, కేతన్‌పల్లి, ముల్కలపేట, గొర్లపల్లి, రాజారాం గ్రామపంచాయతీల్లో డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతివనాలు శుక్రవారం ఎంపీవో శ్రీపతి బాపురావు పరిశీలించారు. నిరంతరం శానిటేషన్ పనులను విస్తృతంగా చేపట్టి ఇంటింటి చెత్త సేకరించి డంపింగ్‌యార్డులకు తరలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు జాఫర్, అశోక్, సిరాజ్, పోశన్న, సురేష్, సాయి, సుదర్శన్ పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

లక్సెట్టిపేట: స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి చెల్లా ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మండల టాపర్‌కు సత్కారం



యశస్వినిని సత్కరిస్తున్న నాయకులు

చెన్నూర్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తుమ్మల యశస్విని 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కాగా ఆమెను వినోద్, వివేక్ యువసేన అధ్యక్షులు తనుగుల రవికుమార్ మెమొంటో అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేశ్, ఇర్ఫాన్, అఖిల్, ముబీన్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం సమీపంలో ఈ నెల 4న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నలుగురికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రూ.16వేల నగదుతో పాటు బియ్యం అందజేశారు. మంచిర్యాల నుంచి భీమారం వైపు వెళ్తున్న ఆటోని బైక్ ఢీకొట్టగా బూకల శేషు, పెన్కుల రాజన్న, బూకల రాజన్నలు గాయపడ్డారు. వీరికి కాంగ్రెస్ నాయకులు ఉస్కమల్ల చందు, కట్కూరి ప్రకాశ్‌రెడ్డి, బుక్యా లక్ష్మణ్, దర్శనాల రమేశ్, పాడేటి రవి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

'ఆధార్ నమోదు సెంటర్ ప్రారంభించండి'

చెన్నూర్: మున్సిపాలిటీలో ఆధార్ నమోదు సెంటర్‌ను ప్రారంభించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జాడి తిరుపతి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కేవీఎం శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు గర్రెపల్లి నర్సయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో చెన్నూర్‌లో ఉన్న ఆధార్ సెంటర్‌ను మూసివేసినట్లు తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీ ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఆధార్ నమోదు కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోశ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఆధార్ కేంద్రాన్ని తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం..!

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- దుర్వాసనతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- పట్టించుకోని అధికారులు



చెన్నూర్ 15వ వార్డులో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో గల 15వ వార్డును అధికారులు పట్టించుకోవడం లేదని వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. వార్డులో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఈ కాలనీని సందర్శించిన పాపాన పోలేదని కాలనీవాసులు పేర్కొంటున్నారు. రోడ్లు, మురుగు కాలువలు లేక వర్షపు నీరు రోడ్లపై పారుతుండడంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు తెలిపారు. విద్యుత్ దీపాలు అక్కడక్కడ వెలుగుతున్నాయి. కాలనీలో పూర్తి స్థాయిలో విద్యుత్ దీపాలు సైతం లేకపోవడం దారుణమన్నారు. మిషన్ భగీరథ పైపులైన్లు వేసినప్పటికీ చుక్క నీరు వచ్చిన దాఖలాలు లేవు. అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

వచ్చేది వర్షాకాలం..

కాలనీలో పారిశుధ్యం లోపించింది. పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టకపోతే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు పరిస్థితి చేజారకముందే కాలనీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మున్సిపాల్ అధికారులకు బిల్లుల వసూలు పై ఉన్న శ్రద్ధా కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై లేదు. కాలనీలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగు కాలువలు లేవు. విద్యుత్ దీపాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్లపైకి వస్తుంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

\- బండారి సంతోశ్, కాలనీ వాసి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ఏరియాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ రాంమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తీగల్‌పహాడ్ 11 కేవీ ఫీడర్ మరమ్మత్తుల దృష్ట్యా తీగల్‌పహడ్, నస్పూర్ పరిధిలోని పలు ఏరియాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాసిపేట: మండలంలోని కాసిపేట టౌన్ ఫీడర్‌లో మరమ్మతులు ఉన్నందునా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. కాసిపేట, చిన్నధర్మారం, ముత్యంపల్లి గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

వేమనపల్లి: కిష్టంపేట నుంచి కోటపల్లికి వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మందమర్రిరూరల్: మందమర్రిలోని పలుచోట్ల 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, లైన్‌లు తాకుతూ, దగ్గరగా ఉన్నటువంటి చెట్ల కొమ్మలు తొలగించడం కోసం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ మందమర్రి పట్టణ ఏఈ మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని విద్యానగర్, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, జీఎం ఆఫీస్ ఏరియా, అంగడిబజార్, రామన్ కాలనీ, యాపల్ ఏరియా, కేకే–2 ఏరియా, టోల్ ప్లాజా, అందుగులపేట, ఊరు మందమర్రి, ఎర్రగుంటపల్లె, గఫూర్ బాబా ఏరియాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులకు శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ ప్రభాకర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీరాంపూర్: సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కోరారు. శుక్రవారం సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చెందూరి మహేందర్ జీఎం కార్యాలయంలో జీఎం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరగడం, వేసవి ఎండల కారణంగా మంచిర్యాల రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలు తగ్గాయని తెలిపారు. తలసేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు తరచూ రక్తం ఎక్కించాల్సి ఉందని, జిల్లాలో వీరి సంఖ్య ఎక్కువగానే ఉందన్నారు. మరోపక్క ప్రభుత్వ ఆసుపత్రిలోని గర్భిణులకు అత్యవసర సమయాల్లో రక్తం అందించాల్సి ఉంది. బ్లడ్ బ్యాంక్‌లో రక్తనిల్వలు అడుగంటాయని దీనిని పెంచడం కోసం సింగరేణి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

కార్మికులపై పని భారం తగ్గించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కే 5బీ గనిపై కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పని స్థలాల వద్ద వెంటలేషన్ సౌకర్యం సరిగ్గా లేదన్నారు. టూల్ బాక్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మ్యాన్‌రైడింగ్‌ను షిఫ్ట్ సమయానికి 10నిమిషాల ముందే ఆన్ చేయాలని కోరారు. క్యాంటీన్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పని స్థలాల వద్ద సరిపడా మ్యాన్ పవర్‌ను కేటాయించనందున, ఉన్నవారిపై పనిభారం పెరుగుతుందన్నారు. రెస్ట్ హాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గతంలో సరైన లాకర్లు లేకపోవడం వల్ల గనిలో దొంగలు పడి బీభత్సం సృష్టించారని, ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే పటిష్టమైన లాకర్లను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, నాయకులు పిన్నింటి మల్లారెడ్డి, నీలం సదయ్య, పీ. మహేందర్ రెడ్డి, పిట్ సెక్రటరీ శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ నంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాములు

భీమారం: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మంచిర్యాల ఆర్డీవో రాములు ఆదేశించారు. భీమారం మండల కేంద్రంలోని వరిధాన్యం కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరిన వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇందులో తహసీల్దార్ సదానందంతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓతో కూలీల వాగ్వాదం



ఎంపీడీఓతో వాగ్వాదం చేస్తున్న కూలీలు

భీమిని: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామపంచాయతీలో ఉపాధిహామీలో అవకతవకలు జరిగాయని గతంలో కూలీలు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం లక్ష్మీపూర్ గ్రామానికి ఎంపీడీఓ గంగామోహన్ ఏపీవోతో కలిసి వెళ్లి విచారణ చేపట్టగా ఉపాధిహామీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని వాగ్వాదం చేశారు. దీంతో ఎంపీడీఓ గంగామోహన్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 6న విచారణ చేపడతామన్నారు. ఉపాధిహామీలో అవకతవకలు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

అందుబాటులో ఉండాలి



ఇన్‌చార్జి డీసీఎస్‌వోకు పుష్పగుచ్ఛం అందజేస్తూ...

మంచిర్యాలఅగ్రికల్చర్: రేషన్ దుకాణాదారులు వినియోగదారులకు అందుబాటులో ఉండాలని ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డీసీఎస్‌వో హరికృష్ణ అన్నారు. జిల్లాలోని రేషన్‌డీలర్లు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఇంచార్జీ డీసీఎస్‌వోను శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డీఎం గోపాల్, డీలర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సత్తయ్య, సత్యనారాయణరెడ్డి, భూర్ల మహేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం తయారీ కేంద్రాలు ప్రారంభం



మందమర్రిలో ప్రారంభిస్తున్న ఎంపీడీవో



నెన్నెల: ప్రారంభిస్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి



కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నెన్నెల: మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల యూనిఫాం తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పాఠశాలల యూనిఫాం తయారీని మహిళా సంఘాలకు అప్పగించిందన్నారు. విద్యా సంవత్సరం పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చూడాలని మహిళా సంఘాలను ఆదేశించారు. కార్యక్రమంలో నెన్నెల హైస్కూల్ హెడ్‌మాస్టర్ దండనాయకుల ప్రకాష్ రావు, ఏపీఎం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సాగర్, గ్రామైక్య సంఘాల మహిళలు పాల్గొన్నారు.

భీమిని: భీమిని మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో కుట్టు మిషన్ కేంద్రాన్ని ఎంపీడీవో గంగామోహన్, ఎంపీవో సబ్దర్‌ఆలీ, ఏపీఓ ప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. మండలంలోని పాఠశాలలకు చెందిన 3200మంది విద్యార్థులకు యూని ఫాంలు కుట్టేందుకు ఈ టైలర్ కేంద్రాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.

మందమర్రిరూరల్: పట్టణంలోని రెండో జోన్ రైల్వే స్టేషన్ రోడ్ వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి సమీపంలో విద్యార్థుల యూనిఫాం తయారీకేంద్రం సెంటర్–2 శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు సెంటర్‌కు అప్పగించిన విద్యార్థుల యూనిఫామ్స్ స్టిచ్చింగ్ పూర్తి చేయాలని సెంటర్ నిర్వాహకురాలికి సూచించారు. ఆయన వెంట ఐకేపీ ఏపీఎం లలితకుమారి, చారి, సీసీ విజయ నిర్మల, రజిత తదితరులు ఉన్నారు.

జైపూర్: ఐకేపీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు అందించే యూనిఫాం క్లాత్‌లను మహిళా సంఘాల అధ్యక్షులకు అందజేశారు. విద్యార్థులకు అందించే యూనిఫాంలను కుట్టు మిషన్ ద్వారా కుట్టి విద్యార్థులకు అందించేందుకు మహిళా సంఘాలకు అందించినట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, సద్వినియోగపర్చుకోవాలన్నారు. 42 స్కూళ్లలో 1723 మంది విద్యార్థులకు యూనిఫాం అందించే క్లాత్ అందించారు. ఇందులో ఎంపీడీవో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, మహిళా సంఘాల అధ్యక్షులు ఉన్నారు.

హమ్మయ్య దాహం తీరింది..!



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎండల వల్ల జనం పలు రకాలుగా దాహాన్ని తీర్చుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. ఈ క్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంచరిస్తున్న కోతులు తమ దాహం తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నాయి. శుక్రవారం హాజీపూర్ మండలం వేంపల్లిలో ఓ కోతి తన దాహాన్ని తీర్చుకునేందుకు నానా తంటాలు పడింది. గ్రామ పంచాయతీ పక్కనే ఉన్న మంచినీటి ట్యాంకు ద్వారా ఓ ట్యాంకర్‌లోకి నీటిని పడుతుండగా ట్యాంక్ నిండిపోవడంతో నీటిని బంద్ చేశారు. అప్పుడే అక్కడికి వచ్చిన ఓ కోతి నీటిని తాగేందుకు పైప్‌లోకి తొంగిచూస్తూ కొద్దికొద్దిగా వస్తున్న నీటితో మొత్తానికి తన దాహార్తిని తీర్చుకుంది. ఆ కోతి నీరు తాగేందుకు పడిన ఆరాటం, విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అక్రమంగా వెలిసిన గుడిసెల తొలగింపు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట రేంజ్ తపాలాపూర్ అటవీ బీట్‌లోని కోలాంగూడలో భీమన్న దేవుని పేరున వేసిన గుడిసెలను అటవీ అధికారులు తొలగించారు. కోలాంగూడ ప్రాంతంలో ఆత్రం చిన్న రాజం భీమన్న దేవుని గుడి పేరుతో గుడిసెలు వేసి విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు అమర్చగా, సమాచారం అందుకున్న తాళ్లపేట రేంజ్ పరిధిలోని అటవీ అధికారులు గుడిసెలను, విద్యుత్ స్తంభాలను తొలగించారు. అడవిలో అక్రమంగా గుడిసెలు వేయడంతో వాటిని తొలగించామని రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

ఘనంగా చండీయాగం



యాగంలో పాల్గొన్న జీఎం దంపతులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో జరుగుతున్న స్వాముల వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుదర్శన నర్సింహా సంహిత చండీయాగం ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి అనంతచార్యుల వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ చండీయాగానికి పండితులు శన్ముక శర్మ బృందం ప్రత్యేక చండీయాగంలో పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలు ఆరోగ్య, ఐశ్వర్య ప్రాప్తి కోసం ఈ చండీయాగం నిర్వహిస్తున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. పూజల్లో ఏరియా జీఎం మనోహర్ సవిత, రామగుండం జీఎం చింతల శ్రీనివాస్ లక్ష్మి దంపతులు, అధికారులు భక్తులు పాల్గొన్నారు.

బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న నాయకులు

జన్నారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సమితి జిల్లా కన్వీనర్ కొడూరి చంద్రయ్య, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ శాసన సభ ఎన్నికల సందర్భంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. సమావేశంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ పోరాట సంఘం జిల్లా కో కన్వీనర్లు నర్సయ్య, మంచిర్యాల జిల్లా కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షం... తడిసిన ధాన్యం



కోటపల్లిలో తడిసిన ధాన్యం

కోటపల్లి: యాసంగి సీజన్‌లో అన్నదాతలను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. రెండు, మూడు రోజుల నుంచి కురిసిన వర్షాలకు మండలంలోని పార్‌పల్లి, కోటపల్లి, కొల్లూర్, దేవులవాడ, ఆలుగామలో ఈదురు గాలులతో వర్షం కురిసింది. శుక్రవారం కురిసిన వర్షానికి గ్రామాల్లోని ఐకేపీ, డీసీఎంఎస్ కేంద్రాల్లో కల్లాలోని ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. బలమైన గాలులతో ధాన్యం కుప్పలపై వేసిన టార్పాలిన్ కొట్టుకపోయింది. దీంతో ధాన్యం తడిసిపోయింది. అమ్ముకునే క్రమంలో ధాన్యం తడిసిపోవడంతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: విదేశాలలో మాస్టర్ లెవెల్, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరోల్ ప్రోగ్రాం చదువుతున్న గిరిజన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో గిరిజన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

'దేశానికి భగవద్గీత అవసరం'

పాతమంచిర్యాల: దేశానికి, సమాజానికి, కుటుంబానికి భగవద్గీత, భాగవతం చాలా అవసరమని హరేకృష్ణ ఇస్కాన్ ప్రచారకులు రాధాకృష్ణ ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హిందూసేవక్ సమాజ్ ఫౌండేషన్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గోవులు, స్త్రీలు, వృద్ధులు, పిల్లలను గౌరవిస్తే మనం, మన కుటుంబాలు, సమాజం సుఖ సంతోషాలతో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ హిందూపరిషత్ తెలంగాణ రాష్ట్ర గోరక్ష వైస్ ప్రెసిడెంట్ కొట్టి నటేశ్వర్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, హిందూ సేవక్ సమాజ్ డైరెక్టర్ విజయ భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డితో సోషల్ మీడియా కో ఆర్డినేటర్

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొడ్డు రాకేశ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇటీవల హైదరాబాద్‌లో సోషల్ మీడియా వారియర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో సెల్ఫీ విత్ రేవంత్‌రెడ్డి కార్యక్రమం ఏర్పాటు చేశారు. సెల్ఫీ కార్యక్రమంలో రాకేశ్ ముఖ్యమంత్రితో సెల్ఫీ తీసుకున్నారు.

'గురుకులం పిలుస్తోంది'పై అవగాహన

పాతమంచిర్యాల: మైనారిటీ గురుకులాల సెక్రెటరీ అయేషా మస్రత్‌ఖానం ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలోని మసీదులలో 'గురుకులం పిలుస్తోంది'పై ముస్లిం మత గురువులు, పెద్దలు మైనారిటీ గురుకుల కళాశాలల్లో అడ్మిషన్‌లపై అవగాహన కల్పించారు.

విధుల్లో చేరిన కార్యదర్శి

వేమనపల్లి: మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్యదర్శి శ్యాంచంద్ మూడు నెలలుగా దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు. తిరిగి శుక్రవారం ఎంపీఓ శ్రీపతి బాపురావు సమక్షంలో విధుల్లో చేరారు. అనివార్య కారణాల వల్ల విధులకు దూరమైనట్లు తెలిపారు.